epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 82 | గురువారం | 01.08.2024



## చైర్మన్ గిరిపై

# కిరికిరి

### జనగామ మార్కెట్ పదవికి పోటా పోటీ

- రోజురోజుకూ పెరుగుతున్న ఆశావహులు
- జోరుగా సాగుతున్న బేరసారాలు
- సీటు రేటు రూ.50 లక్షలట..!
- తక్కెట్లో దూగని సీనియర్లకు మొండి'చేయి'
- జూనియర్ల వైపే మొగ్గు చూపుతున్నారా?

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో** ఏనుమాముల తర్వాత అతి పెద్దదయినది జనగామ వ్యవసాయ మార్కెట్.. అలాంటి మార్కెట్‌కు పాలకవర్గం లేక అస్తవ్యస్తంగా తయారైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పోస్టులన్నింటినీ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కొంత కాలంగా వాటిని భర్తీ చేస్తూ వస్తోంది అధిష్ఠానం. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని ఓ వైపు సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నా.. జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సీటుకు మాత్రం అది వర్తించడం లేదని తెలుస్తోంది. ఎందుకంటే ఇక్కడ చైర్మన్ పదవి కోసం ఆశావహులు ఎక్కువగా ఉండడంతో సీటు రేటు రూ.50 లక్షల వరకు పలుకుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ తక్కెట్లో దూగని సీనియర్ నేతలకు మొండి'చేయి' చూపుతున్నారని తెలుస్తోంది. అయితే తమను కాదని జూనియర్లను అందలం ఎక్కిస్తే తర్వాత పరిణామాలు వేరేలా ఉంటాయని వారు అల్టిమేటం ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

2లో..



మాదకద్రవ్య రహిత

## జిల్లాగా మార్చాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

3



మొక్కల పెంపకం

## అందరి బాధ్యత

- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

3




మన తాతలకు

## ఉత్తరం రాద్దాం

- కడవేరుగు స్కూల్‌లో వినూత్న ప్రోగ్రాం

2

General News



# చైర్మన్ గిరిపై కిరికిరి

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవిపై పీట ముడి వీడడం లేదని తెలుస్తోంది. ఇందుకు ఆశవహులు ఎక్కువగా ఉండడం కారణం ఒకటైతే.. సీటు రేటు కోటి రూపాయల వరకు పలుకుతుందని ప్రచారం సాగుతోంది. పార్టీలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న సీనియర్ లీడర్లు తాము డబ్బులు ఎందుకు ఖర్చుపెట్టాలని వాదనలు చేస్తున్నారు. అయితే తక్కెట్లో దూగని అలాంటి లీడర్లపై కొందరు నేతలు హైకమాండ్‌కు తప్పుడు సంకేతాలు పంపిస్తున్నట్టు తెలుస్తోంది.

## రెండు వర్గాల నుంచి ఆశావహులు..

కాంగ్రెస్ పార్టీకి గతంలో జనగామ నియోజకవర్గం కంచుకోటలా ఉండేది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో టీఆర్ఎస్ జనగామలో పాగా వేసింది. వరుసగా మూడు సార్లు ఆ పార్టీ అభ్యర్థులే గెలిచారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా జనగామలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై టీఆర్ఎస్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. అప్పటి నుంచి కాంగ్రెస్‌లో మళ్లీ చీలికలు మొదలయ్యాయి. కొందరు లీడర్లు కొమ్మూరి వైపు ఉంటే.. మరి కొందరు వేరు కుంపటి పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. అయితే ఈ రెండు వర్గాల నుంచి మార్కెట్ చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది. టీపీసీసీ కార్యదర్శి కంచె రాములు, సీనియర్ న్యాయవాది, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆలేటి సిద్దిరాములు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బడికె ఇందిర, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ సర్వల నర్సింగరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత జక్కుల వేణుమాధవ్, యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా ప్రెసిడెంట్ బనుక శివరాజ్ యాదవ్ చైర్మన్ పదవికి పోటీ పడుతున్నట్టు తెలుస్తోంది.

## ఎవరికి వారు పైరవీలు..

చైర్మన్ పదవికి పోటీలో ఉన్న వారు ఎవరికి వారు గాడ్ ఫాదర్ల ద్వారా పైరవీలు చేస్తున్నట్టు తెలుస్తోంది. సీనియర్ నేత కంచె రాములు కోమటిరెడ్డి బ్రదర్స్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ద్వారా పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ఇక పార్టీలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న సీనియర్ నేతలు అలేటి సిద్దిరాములు తనకు ఎలాంటి గాడ్ ఫాదర్లు లేకున్నా పార్టీ హైకమాండ్ ను నమ్ముకుని ముందుకు సాగుతున్నట్లు సమాచారం. ఇక మరో సీనియర్ నేత జక్కుల వేణుమాధవ్ కూడా చైర్మన్ పీఠం కోసం గట్టి ప్రయత్నమే చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి చక్రం తిప్పుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక కొమ్మూరి వర్గంగా పేరున్న బనుక శివరాజ్ యాదవ్, బడికె ఇందిర, సర్వాల నర్సింగరావు ఆ వైపు నుంచి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఇందులో శివరాజ్ యాదవ్ వైపు డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. శివరాజ్ చైర్మన్ పీఠం కోసం కొన్ని రోజుల కింద పార్టీ పెద్దలను కూడా కలిసినట్టు తెలిసింది.

### జనగామ మార్కెట్ పదవికి పోటాపోటీ

- రోజురోజుకూ పెరుగుతున్న ఆశావహులు
- జోరుగా సాగుతున్న బేరసారాలు
- సీటు రేటు రూ.50 లక్షలట..!
- తక్కెట్లో దూగని సీనియర్లకు మొండి'చేయి'
- జూనియర్ల వైపే మొగ్గు చూపుతున్నారా?



## రిజర్వేషన్ గాలికి..

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను తీసుకొచ్చింది. అలా 2016లో జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఓసీ మహిళకు రిజర్వేషన్ కావడంతో టీఆర్ఎస్ నేత, ఉద్యమకారుడు బండ యాదగిరిరెడ్డి సతీమణి బండ పద్మకు చైర్‌పర్సన్ పదవి దక్కింది. 2019లో ఆమె పదవీ కాలం ముగిసిన తర్వాత రిజర్వేషన్ డ్రా ప్రకారం బీసీ(డీ) మహిళకు రిజర్వు అయ్యింది. అయితే అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా బీసీ (బీ) మహిళ అయిన బాల్దె విజయకు చైర్‌పర్సన్ పీఠాన్ని కట్టబెట్టింది. ఆమె పదవీ కాలం పూర్తయ్యాక.. బీసీ (ఈ) జనరల్‌కు రిజర్వేషన్ కాగా.. అప్పుడు కూడా అదేమీ పట్టించుకోకుండా బీసీ(బీ) అయిన బాల్దె సిద్దిలింగంకు మార్కెట్ చైర్మన్‌గా అప్పటి టీఆర్ఎస్ సర్కారు అవకాశం ఇచ్చింది. అయితే రిజర్వేషన్ మొదలైన నాటి నుంచి ఒక్కసారి మాత్రమే పక్కాగా అమలు చేశారు. ప్రస్తుతం జనగామ మార్కెట్ చైర్మన్ పదవి బీసీ (ఏ) జనరల్‌కు రిజర్వు అయ్యింది. అయితే పోటీలో ఉన్న లీడర్లలో ఎవరు కూడా బీసీ (ఏ)కు చెందిన వారు కాకపోవడంతో ఈసారి కూడా రిజర్వేషన్ గాలికి వదిలేస్తారా.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు కాంగ్రెస్ లో బీసీ(ఏ) లీడర్లే లేరా అనే వాదనలు కూడా పైకి వస్తున్నాయి. మొత్తానికి జనగామ వ్యవసాయ మార్కెట్ కిరికిరి ఇంకెన్ని రోజులకు తేలుతుందో వేచి చూడాలి మరి..!




# బడి పిల్లలు కార్యక్రమాలపై ఆసక్తి చూపాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** బడి పిల్లలు పాఠశాలలో జరిగే కార్యక్రమాలపై ఆసక్తి చూపాలని మండలంలోని కడవేరుగు పాఠశాల పీజీ హెచ్ఎం బల్ల శ్రీనివాస్, శిల్ప కళా రిసోర్స్ పర్సన్ గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్, బాల సాహిత్య పురస్కార గ్రహిత చొక్కాపు వెంకటరమణ గౌరవార్థం బాల సాహిత్య రజతోచ్చావాల్లో భాగంగా పత్తిపాక ఫౌండేషన్, గరిపెల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కడవేరుగు పాఠశాలలో అవ్వా 'తాతలకు ఉత్తరం రాద్దాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటరమణ గౌరవార్థం పోస్టల్ కవరును కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం, పత్తిపాక వారికి అవార్డు రావడం హర్షనీయమని వారు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ముప్పై పాఠశాలలను ఎంపిక చేయగా అందులో మన పాఠశాల ఉండడం ఆనందంగా ఉందని వారు అన్నారు. విద్యార్థుల సృజనాత్మాతకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, చంద్రశేఖర్రావు, లింగం, కృష్ణమూర్తి, రామకృష్ణ, అరుణ, సాజీదాబేగం పాల్గొన్నారు.



# బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా కనకయ్య

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మండలంలోని తపాస్‌పల్లి గ్రామానికి చెందిన పుట్ట కనకయ్యను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా, మండల కేంద్రానికి చెందిన పబ్బోజు రాజు ఆర్గనైజింగ్ సెక్రటరీగా బుధవారం నియామకం అయ్యారు. సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల గెలుపే లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని తోకల ఉమారాణి సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం తమ శక్తివంచనగా కృషి చేస్తామని కనకయ్య, రాజు పేర్కొన్నారు. తమ నియామకానికి సహకరించిన పార్టీ నాయుకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగోజు నాగరాజు పాల్గొన్నారు.

# గీత కార్మికుడిని పరామర్శించిన రాజిరెడ్డి

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన బొందుగుల శేఖర్ అనే గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలు కాగా ఆ కుటుంబాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు బండి శ్రీనివాస్, పులూరీ రాజు, గణేష్, వినోద్, మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి ఉన్నారు.

Local News



# మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చాలి

■ **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లా మార్చేందుకు అధికారులు కృత నిశ్చయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణ సమన్వయ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ నెల ఈ సమావేశం తప్పనిసరిగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో ప్రతీ శుక్రవారం విద్యార్థుల బ్యాగులు, వసతి గృహాల్లోని విద్యార్థుల ట్రంకు పెట్టెలను వార్డెన్లు తనిఖీ చేయాలన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల వద్ద టోల్ ఫ్రీ నెంబర్ బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే మాదకద్రవ్యాలను ఎవరైనా వినియోగించినట్లైతే, వారి సమాచారాన్ని అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, అదే విధంగా వారికి తగిన పారితోషికం అందిస్తామని తెలిపారు. రైల్వే స్టేషన్, బస్టాండ్లలో పనిచేసే సిబ్బంది, అలాగే ఆ పరిసరాల్లో ఉండే షాపు యజమానులు, వర్కర్లతో సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లలో టోల్ ఫ్రీ నెంబర్ తో పాటు మాదకద్రవ్య రహిత ఏరియా స్టికర్లను ఏర్పాటు చేయాలన్నారు. కోప్టా యాక్ట్ కింద 200 మీటర్ల వరకు ఎటువంటి గుట్కా, పాన్ షాపులు ఉండకూడదని, నిషేధిత పొగాకు ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేయకూడదన్నారు. బార్లు, రెస్టారెంట్ల సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆగస్టు 10న యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ ను నిర్వహించాలన్నారు. సమీక్షలో డీఈఓ రాము, డీఏఓ వినోద్ కుమార్, డీఎంహెచ్ఓ హరీష్‌రాజ్, ఎక్సైజ్ సీఐ ప్రభావతి, డీఐఈఓ శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, సీటీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రం పర్యవేక్షణ

జిల్లాలోని లింగాలఘనపురం మండలం మాణిక్యపురం గ్రామ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల నైపుణ్యాలను పరీక్షించారు. కేంద్రంలో గల సంబంధిత హాజరు పట్టిక, గుడ్లు, పాలు, పప్పు, తదితర స్టాక్ నిల్వల రిజిస్టర్లను తనిఖీ చేసి, పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఇవ్వడం ఎంతో కీలకమని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని అదేశించారు. ఆయన వెంట జనగామ ఆర్డీఓ కొమురయ్య, లింగాలఘనపురం తహసీల్దార్ వినయలత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

## అప్రోచ్ రోడ్డు కోసం స్థల పరిశీలన.

జిల్లాలో పారిశ్రామిక ప్రాంతాన్ని మరింతగా విస్తరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. బుధవారం లింగాలఘణపురం మండలం మాణిక్యాపురంలో టెక్స్ టైల్ ఇన్‌డస్ట్రియల్ పార్క్ కోసం మూడు ఎకరాల భూసేకరణలో భాగంగా చేపట్టే అప్రోచ్ రోడ్డు స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. తదుపరి సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కొమురయ్య, తహసీల్దార్ వినయలత ఉన్నారు.





# మొక్కలు సంరక్షణ అందరి బాధ్యత

■ **అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్**

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జనగామ అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షిస్తే మానవ మనుగడకు ఎంతో దోహదపడుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, అడిషనల్ డీఆర్ఓ చంద్రశేఖర్, ఎంపీడీవో రాములు, ఎంపీఓ రవికుమార్, ఏపీఎం నరేందర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# పౌరులు తమ హక్కులను పొందాలి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. మండలంలోని కొడవటూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిమ్న జాతుల వారిని కించపరిస్తే చట్ట ప్రకారం శిక్ష పడుతుందన్నారు. సదస్సులో ఏఆర్ఐ శ్రీనివాస్ రావు, పంచాయతీ కార్యదర్శి రూప చైతన్య, ఫీల్స్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.

# కూలర్ల కొనుగోలులో అవకతవకలు జరుగలేదు

**చేర్యాల, మన చౌరాస్తా :** కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో గత వేసవిలో కొనుగోలు చేసిన కూలర్లలో ఏలాంటి అవకతవకలు జరుగలేదని ఈవో బాలాజీ బుధవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన కొంత మంది యువకులు కూలర్ల కొనుగోలు చేసిన విషయంలో అవకతవకలు జరిగాయంటూ వినతి పత్రం అందించిన నేపథ్యంలో విచారణ చేపట్టగా ఆలయంలో కొనుగోలు చేసిన కూలర్ల ధరను ఆన్‌లైన్‌లో చూడగా రూ. 12,700 ఉందని దుకాణాదారుడు రూ.12,800 ఆలయానికి విక్రయించాడని తెలిపారు. కొంత మంది యువకులు కావలనే ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని, వారిపై అవసరమైతే చట్టపరమై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



## టీచర్ల అభినందన సభకు

# ఏర్పాట్లు చేయండి

- అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు హైద్రాబాద్ వెళ్లే అభినందన సభకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే అభినందన సభ హైద్రాబాద్ లో ఆగస్టు 2న జరుగనున్న నేపథ్యంలో ఆదిశగా సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్ లో అభినందన సభ సందర్భంగా చేపట్టే ఏర్పాట్లపై నియమించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో జిల్లా నుండి 581 మంది పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఆగస్టు 2 న హైదరాబాద్ ఎల్ బి స్టేడియం నందు ఏర్పాటు చేసే అభినందన సభకు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు వెళ్ళవలసి ఉన్నందున ఆర్.టి.సి బస్సుల ఏర్పాటు , లైజన్ అధికారుల నియామకం, భోజన సదుపాయాలు అలాగే ఐడి కార్డుల ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ అభినందన సభకు వెళ్లే సమయంలో ఎక్కడకూడా సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని అలాగే సమిష్టిగా కలసి పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో రాము, డిఏఓ వినోద్ కుమార్, డి సి ఎస్ ఓ రోజారాణి, డీఎం సివిల్ సప్లై ప్రసాద్, డి.ఎం.ఓ నరేంద్ర, డీఎంహెచ్ వో హరీష్‌రాజు, ఆర్టీసీ డీఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## సోమన్న ఆలయానికి
# రూ.30,185 ఆదాయం

**పాలకుర్తి , మన చౌరాస్తా :** శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో పాత ఇనుము సామాగ్రి మరియు ఇతర స్క్రాప్ వస్తువులను బహిరంగ వేలం ద్వారా కిలో చొప్పున విక్రయించగా రూ. 30,185 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. బుధవారం దేవస్థాన కార్యాలయంలో పాత ఇనుము సామాగ్రి మరియు ఇతర స్క్రాప్ వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించారు. బహిరంగ వేలంలో పాత ఇనుప సామాను కిలో రూ. 30 చొప్పున 10 క్వింటాల 51 కేజీలకు రూ.30,153, ప్లాస్టిక్ సామాను కిలో రూ. 4 చొప్పున 8 కేజీలు రూ, 32, బహిరంగ వేలం ద్వారా పాలకుర్తి మండలం దుబ్బ తండ కు చెందిన బానోతు రాములు రూ. 30,185కు కొనుగోలు చేసినట్లు ఈవో తెలిపారు. ఈ వేలం పాటలో కొడవటూరు దేవాలయ ఈవో వంశీ, పాట దారులు, అర్చకులు పాల్గొన్నారు.



'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812



# శాఖంబరిగా.. పార్వతీ మాత

జనగామ జిల్లా కేంద్రంలోని పాత బీటు బజారులోని శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో పార్వతి అమ్మవారిని బుధవారం కూరగాయలతో 'శాఖంబరి' అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శివరాజ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - మన చౌరాస్తా, జనగామ

మన చౌరాస్తా
30.07.2024 మంగళవారం

# అదరగొట్టిన మిల్కీ బ్యూటీ

మన చౌరాస్తా, సినిమా : టాలీవుడ్ హీరోయిన్ తమన్నా ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో చాలా బిజీగా ఉంటుంది. తెలుగుతోపాటు అటు హిందీలోనూ వరుస ఆఫర్స్ అందుకుంటుంది. వెండితెరపైనే కాకుండా ఓటీటీలోనూ సత్తా చాటుతుంది. ఓ వైపు కథానాయికగా.. మరోవైపు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోపాటు వెబ్ సిరీస్ అంటూ తెగ హడావిడి చేస్తున్న తమన్నా.. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్ అదరగొట్టేసింది. ఇన్నాళ్లు తెలుగులో పలు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా అలరించిన తమన్నా.. కేజీఎఫ్, జైలర్ వంటి హిట్ చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ అదరగొట్టింది. ఇప్పుడు బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ మూవీ స్త్రీ 2లో మిల్కీబ్యూటీ గెస్ట్ అప్పీరియన్స్ ఇచ్చింది. తాజాగా స్త్రీ 2 నుంచి తమన్నా స్పెషల్ సాంగ్ రిలీజ్ చేయగా.. అందరి దృష్టిని ఆకర్షించింది. ఇందులో తమన్నా డాన్స్ చూసి అడియన్స్ ఫిదా అవుతున్నారు. బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావ్, అపరశక్తి ఖురానా, అభిషేక్ బెనర్జీ, పంకజ్ త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఆగస్ట్ 15న విడుదల కానుంది. 2018లో వచ్చిన సూపర్ హిట్ స్త్రీ సినిమాకు సీక్వెల్ గా ఈ మూవీని రూపొందించారు. స్త్రీ సినిమాలో బీటౌన్ బ్యూటీ నోరా ఫతేహి స్పెషల్ సాంగ్ చేయగా.. ఇప్పుడు ఆ సీక్వెల్‌లో తమన్నా భాటియాకు అవకాశం వచ్చింది. అమర్ కౌశిక్ 'స్త్రీ 2' చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి దినేష్ విజన్ నిర్మాతగా వ్యవహరించగా.. కొన్ని రోజులుగా ప్రమోషన్స్ భారీగా జరుగుతున్నాయి. ఆరేళ్ల క్రితం స్త్రీ సినిమా సూపర్ హిట్ కావడంతో స్త్రీ 2పై మరింత హైప్ పెరిగింది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ మూవీపై మరిన్ని అంచనాలు పెంచగా.. ఇప్పుడు విడుదలైన స్పెషల్ సాంగ్ ఆకట్టుకుంటుంది. యూట్యూబ్ లో మిలియన్స్ కొద్దీ వ్యూస్ రాబట్టింది. గతంలో జైలర్ సినిమాలోని తమన్నా చేసిన కావాలయ్యా పాట కూడా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే.

vishwatejam.com

# విశ్వతేజం

సమస్త సమాచారం మీ గుప్పిట్లో..

vishwatejam.com

విశ్వతేజం

సమస్త సమాచారం మీ గుప్పిట్లో..

vishwatejam.com

విశ్వతేజం

సమస్త సమాచారం మీ గుప్పిట్లో..

మన చౌరాస్తా

The Complete

News way

## ఆగస్టు 31లోగా

## సీఎంఆర్‌ను పూర్తి చేయాలి